క్లుప్తంగా

ఉపాధి సిబ్బందికి శిక్షణ

అమలాపురం రూరల్: అమలాపురం మండలంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్‌లో ప్రారంభించనున్న పనులకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా హాజరు వివరాలను ఆన్‌లైన్ ద్వారా పంపించే అంశంపై ఉపాధి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొలతలు రూపొందించి కూలీలతో పనులు చేయించే అంశంపై ఏపీడీ రాంబాబు, ఎంపీడీవో ఉండ్రు బాబ్జి రాజు, ఏపీవో శివకుమారి అవగాహన కల్పించారు. 117 మంది ఉపాధి సిబ్బంది ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జేఈ సుజాత, టీఏ సత్య సూరిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏసుబాబుకు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పరామర్శ

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి ఏసుబాబును ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, పార్టీ నాయకులు బుధవారం పరామర్శించారు. ఏసుబాబు తల్లి దివంగత సత్యవతి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీతో పాటు పార్టీ నాయకులు సూదా గణపతి, సాగిరాజు సాయిరాజు, కర్రి సతీష్, వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్లు కర్రి రాఘవ, కర్రి దత్తుడు తదితరులు ఏసుబాబును పరామర్శించారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు వివిధ శాఖాధికారులు విధిగా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శెట్టి బలిజ కులానికి న్యాయం చేయండి

కాట్రేనికోన: కాట్రేనికోన ఎంపీపీ పదవిని శెట్టి బలిజ కులానికి కేటాయించి న్యాయం చేయాలని మండల శెట్టి బలిజ సంఘ నాయకులు డిమాండ్ చేసారు. కాట్రేనికోనలో పార్టీ సీనియర్ నాయకుడు సంసాని నాగేశ్వరావు అధ్యక్షతన బుధవారం శెట్టి బలిజ సమాజిక వర్గం వైఎస్సార్ సీపీ నాయకులు సమావేశమయ్యారు. ఇటీవల కాట్రేనికోన ఎంపీపీ పాలెపు లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందడంతో ఎంపీపీ పదవిని భర్తీ చేయడానికి గురువారం ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నారు. అగ్నికుల క్షత్రియ సమాజిక వర్గానికి చెందిన పాలెపు లక్ష్మి ఎంపీపీగా పని చేసిందని, మిగిలిన ఏడాదిన్నర పదవీకాలాన్ని శెట్టిబలిజ సమాజిక వర్గానికి కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సానబోయిన నాగేశ్వరావు, చొల్లంగి వెంకటేశ్వరావు, గుత్తుల సత్యనారాయణ ఉన్నారు.

పాతకోరంగి విద్యార్థిని నవోదయకు ఎంపిక



లాస్య

తాళ్లరేవు: నవోదయ విద్యాలయం 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షలో పాతకోరంగికి చెందిన దడాల లాస్య ప్రతిభ కనబరచి పెద్దాపురం నవోదయకు ఎంపికైందని పాతకోరంగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఏఎస్‌వీఎస్ వీర్రాజు బుధవారం తెలిపారు. ఉపాధ్యాయులు కాశి రవీంద్ర, పరమట మాతృశ్రీ ప్రోత్సాహంతో లాస్య సీటు సాధించినట్లు ఆయన తెలిపారు. నవోదయకు ఎంపికైన లాస్యను ఎంఈఓలు ఏ.మంగాయమ్మ, మోకా ఉమ, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, అప్పారావు, తల్లిదండ్రులు లోవరాజు, అనిత అభినందించారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న డ్రైవర్ అరెస్టు

ముమ్మిడివరం: ఆన్‌లైన్ బుకింగ్ సరుకు రవాణా చేస్తున్న కంటైనర్‌లో యానాంకు చెందిన మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి అడ్డుకుని డ్రైవర్‌ను అరెస్టు చేశారు. హైదరాబాద్ నుంచి కంటైనర్‌లో అమెజాన్ సంస్థకు చెందిన ఆన్‌లైన్‌లో బుక్ చేసిన సరుకు తీసుకువచ్చిన కంటైనర్ డ్రైవర్ నల్గొండకు చెందిన డ్రైవర్ కోండ్రు వేణు యానాం నుంచి ఆరు బీరు సీసాలు, రెండు లీటర్ల విస్కీ సీసాలు తీసుకువెళుతుండగా ఎదురుగా చెక్ పోస్టు వద్ద తనిఖీలో పట్టుబడ్డాడు. కంటైనర్‌ను ముమ్మిడివరం తరలిస్తుండగా కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు వారిస్తున్నా వినకుండా డ్రైవర్ కంటైనర్‌ను అమలాపురం వరకూ పోనిచ్చి రెండు బీరు బాటిళ్లను ధ్వంసం చేశాడు. దీంతో ఎక్సైజ్ పోలీసులు డ్రైవర్‌ను అరెస్టు చేసి కంటైనర్‌ను సీజ్ చేశారు. ఈమేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌చార్జ్ అధికారి రవితేజ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెం కమ్యూనిటీ భవనంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గురువారం ఉదయం నిర్వహిస్తున్నట్లు రామ్‌చరణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, జనరల్ మెడిసిన్ తదితర వాటిని పరీక్షిస్తారన్నారు.

మండుతున్న ఎండలు

- మార్చి ప్రారంభం నుంచి భానుడి భగభగలు
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజల బెంబేలు
- ఉక్కబోతతో అల్లాడుతున్న వైనం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



ముమ్మిడివరం నియోజకవర్గంలో నిర్మానుష్యంగా మారిన 216 జాతీయ రహదారి

ముమ్మిడివరం: మండుతున్న ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.మార్చి నెల ప్రారంభ నుంచి భానుడి భగభగలు ప్రారంభం కావడంతో మధ్యాహ్నం సమయాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. రాబోయే రోజుల్లో మండే ఎండల పరిస్థితి తలచుకుని జనం వణికిపోతున్నారు. మరోవైపు రాత్రి పూట కొద్ది పాటి చలి వాతావరణం కనిపిస్తోంది. ఇలాంటి సమయంలోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ వైద్యులు సూచిస్తున్నారు.

34 డిగ్రీలకు చేరిన ఎండలు

రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతున్నాయి. నాలుగు వారాల క్రితం 30 డిగ్రీల సెల్సియస్ నమోదైన ఎండలు వారం రోజుల నుంచి 34–35 డిగ్రీలకు చేరుకున్నాయి. ప్రజలు మండుటెండకు అల్లాడిపోయి తప్పని పరిస్థితుల్లో బయటకు వస్తే ఎక్కడ నీడ దొరికితే అక్కడ సేద తీరుతున్నారు. రాత్రి పూట కొద్ది చలిగా ఉండడంతో కాస్త భిన్న వాతావరణం కనిపిస్తోంది. మార్చి నెలలోనే ఎండలు దంచి కొడుతుండటంతో ముందు, ముందు పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రతిరోజూ 34– 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవుతుండటంతో వివిధ పనులకు వెళ్లే వారితో పాటు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఉదయం 10 గంటలకే ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగటంతో చిరు వ్యాపారుల జీవనోపాధిపై ప్రభావం చూపుతోంది. మేలో మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని నిర్లక్ష్యంగా ఉంటే ప్రజలు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పండ్ల రసాలే శ్రేయస్కరం

ఎండాకాలం అధికంగా మంచినీటిని తాగాలి. వీటితో పాటు కొబ్బరి నీరు, పండ్ల రసాలు (ఐస్) లేకుండా తాగితే మంచిది. సాధారణంగా రోజుకు 4 నుంచి 5 లీటర్ల వరకు నీటిని తాగవచ్చు. వేసవికాలంలో 5 నుంచి 7 లీటర్ల వరకు నీటిని తీసుకోవచ్చు. వీలైనంత వరకు రిఫ్రిజిరేటర్ నీటిని తక్కువగా తీసుకుంటే మంచిదని వైద్యులు చెబుతున్నారు. తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లే వారు 11 గంటలలోపు తిరిగి ఇంటికి రావాలని వైద్యులు సూచిస్తున్నారు. సాయంత్రం 5 గంటల తరువాత బయటకు వెళ్లవచ్చునని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో కాటన్ దుస్తులు ధరించాలని అవి కూడా లేత రంగులో ఉండే దుస్తులు ఆరోగ్యానికి, వేసవి వాతావరణానికి మంచిదని వైద్యులు చెబుతున్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



ముదురుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పనులకు బయటకు వెళ్లే కూలీలకు ఆయా వైద్య సిబ్బంది ద్వారా తెలియజేస్తున్నాం. ప్రజలు తప్పకుండా మంచినీరు అధికంగా తీసుకోవాలి. వడదెబ్బకు గురైతే వారిని ముందుగా నీడ ప్రదేశాల్లోకి తీసుకెళ్లి నీరు తాగించాలి. అందుబాటులో ఉండే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి. ఎండల దృష్ట్యా విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాం.

– సీహెచ్ ముకుంద, వైద్యురాలు, కొత్తలంక పీహెచ్‌సీ

సాగునీటి సమస్యను పరిష్కరించాలి



తాండపల్లిలో వరి చేలను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: పెరిగిన నిత్యావసరాల ధరల ప్రకారం ఉపాధి హామీ పథకంలో రోజువారీ కూలీ, పని దినాలు పెంచాలని, వేతన బకాయిలు చెల్లించాలని, పంటలకు సాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. కోనసీమ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 25 నుంచి 28 వరకూ నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రెండవ రోజు బుధవారం అమలాపురం రూరల్ మండలం కామనగరువు బడుగువారిపేట, వన్నె చింతలపూడి అంబేడ్కర్ నగర్, తాండవపల్లి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు.ఈ యాత్రలో శ్రీనివాసరావుతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరాం, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆండ్ర మాల్యాద్రి, పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తాండవపల్లిలో ఉపాధి హామీ కూలీలతో శ్రీనివాసరావు మాట్లాడారు. వేసవికాలం దృష్ట్యా ఉపాధి పథకం పని ప్రదేశాల్లో టెంట్లు మంచినీళ్ల ఏర్పాటు చేయాలని వారు కోరారు. తాండపల్లిలో సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోయారని రైతులు శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఇరిగేషన్ డీఈఈతో ఆయన మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు టి.నాగవరలక్ష్మి, ఎస్.బలరాం, జి.దుర్గాప్రసాద్, సీపీఎం నాయకులు పీతల రామచంద్రరావు, తాడి శ్రీరామమూర్తి, కే.గోపాల్, జి.సిద్ధార్థ, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.ప్రణీత్ సాయి, చైతన్య, అశోక్ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించండి



గురుకులాల్లోని సమస్యలను ఎమ్మెల్యే ఆనందరావుకి వివరిస్తున్న ఎస్ఎంసీ సభ్యులు

అల్లవరం: గోడిలోని బాలురు, బాలికల గురుకులాల్లో మౌలిక సౌకర్యాల కల్పించాలని కోరుతూ గురుకులాల ఎస్ఎంసీ సభ్యుడు స్థానిక ఎమ్మెల్యే ఆనందరావుకి బుధవారం వినతిపత్రం అందించారు. అమలాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను ఎస్ఎంసీ సభ్యులు కలసి గురుకులాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. బాలుర గురుకులంలో ప్రిన్సిపాల్, వార్డెన్, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఉపాధ్యాయులు బోధనేతర పనులు నిర్వర్తించడంతో విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. గురుకులాల్లో మౌలిక సౌకర్యాలు, శాశ్వత ప్రతిపాదికతన సిబ్బంది నియామకం చేపట్టాలని ఎమ్మెల్యే ఆనందరావును కోరారు. సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఆనందరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మర్రి నాగదుర్గ, జంగా శ్రీనివాసరావు, జనిపెల్ల రాఘవ, నాగాబత్తుల శ్రీను, రత్నకుమారి పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం సమీపంలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతిపై ఎదురైన అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని అమలాపురం నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఇన్‌ఛార్జి పాలమూరి మోహన్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత క్రైస్తవులపై, దళితులపై దాడులు పెరిగాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సనాతన ధర్మమని ప్రజలను రెచ్చగొట్టడం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు తగదని సూచించారు. పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ జరిపించి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని మోహన్‌బాబు డిమాండ్ చేశారు.

ఉప్పలగుప్తం: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రభుత్వం నిగ్గుతేల్చాలని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు డిమాండ్ చేశారు. ఈ విషయంపై మండలంలోని చల్లపల్లిలో తన నివాసంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ప్రాణహాని ఉందని వారం రోజుల క్రితం సోషల్ మీడియాలో పాస్టర్ ప్రవీణ్ ఒక పోస్టు పెట్టారని, దీనిపై పోలీసులు లోతుగా దర్యాప్తు జరపాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యంగా క్రైస్తవులు, దళితులు మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని పాస్టర్ ప్రవీణ్ మృతికి కూటమి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని అన్నారు. దోషులను కఠినంగా శిక్షించి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని రమణారావు అన్నారు. పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి రమణారావు తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం

అమలాపురం రూరల్: పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతి రెండు తెలుగు రాష్ట్రాల క్రైస్తవ సమాజానికి తీరని లోటని అమలాపురం వైఎంసీఏ సభ్యుడు సంతాపం తెలిపారు.అమలాపురం వైఎంసీఏ సభ్యుడు అధ్యక్షుడు ఎం బాలస్వామి అధ్యక్షతన బుధవారం సంతాపం సభ నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ క్రైస్తవ సమాజానికి గణనీయంగా సేవ చేశారని అన్నారు. ఆయన మరణంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిజాలను నిగ్గు తేల్చాలని ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను కోరారు. పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులర్పించారు. సెక్రటరీ డాక్టర్ వై. తిమోతి శామ్యూల్ రాజు, సభ్యులు గేల్లా కృపావరం, వి.శాంతిప్రకాష్, యు.మనిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

ఉప్పలగుప్తం: పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణచేసి దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని అమలాపురం నియోజకవర్గం బహుజన సమాజ్ పార్టీ ఇన్‌చార్జ్ పాలమూరి మోహన్‌బాబు కోరారు. మండలంలోని సరిపల్లి ఆయన బుధవారం మాట్లాడుతూ క్రైస్తవులపై దాడులను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఒంటిపూటకూ ఆలస్యంగానా..?

- ఉపాధ్యాయుల తీరుపై డీఈఓ ఆగ్రహం
- అల్లవరం ఎంపీపీ స్కూలు ఆకస్మిక తనిఖీ



నేలపై కూర్చొని విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈఓ సలీం బాష

అల్లవరం: అసలే ఒంటిపూట బడులు. దీనికితోడు ఉపాధ్యాయులు ఆలస్యంగా రావడంతో.. అవాక్కవడం డీఈఓ వంతయింది. ఉపాధ్యాయులెవరూ లేకపోవడంతో అక్కడున్న విద్యార్థులతోనే డీఈఓ ముచ్చట్లు పెట్టుకోవాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే, అల్లవరం మండల ప్రధాన కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ సలీం బాష బుధవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. ఒంటిపూట బడులు కావడంతో ఉదయం 7.45కు బడి తెరవాల్సి ఉంది. పాఠశాల తెరిచే సమయానికి అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కేటీజే మోహనరావు, బోనం నాగమణి, ఖలీజా ఆస్మా హాజరుకాలేదు. పాఠశాల ఆకస్మిక తనిఖీకి వచ్చిన డీఈఓ సలీం బాషను కనీసం పలకరించేందుకు సిబ్బంది ఎవరూ లేరు. దీంతో ఆయన స్కూలు ఆవరణలో అరుగుపై కూర్చొని, స్కూల్‌కు వచ్చిన విద్యార్థులతో ముచ్చటించారు. ఈలోగా 8 గంటలకు ఒక్కొక్కరుగా ఉపాధ్యాయులు విధులకు హాజరు కావడంతో, వారిపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని వారిని ఆదేశించారు. అల్లవరంలో ఎంఈఓ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయులు నిర్ణీత సమయానికి విధులకు హాజరు కాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

అమలాపురం టౌన్: అమలాపురం రైతు బజార్‌కు మార్గంతో పాటు మెయిన్ రోడ్డుపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు వినతి పత్రం అందించారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆర్య వైశ్య సంఘం ప్రతినిధుల పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రైతు బజార్‌కు వెళ్లే రోడ్డులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కాకినాడ– అమలాపురం నాన్ స్టాప్ ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర బస్సులు ముమ్మిడివరం నియోజకవర్గం జామి కామల తూము వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని సూచించారు. జి.వేమవరంలో వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు జీయర్ స్వామి ఆశ్రమం కూడా ఉన్న దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం అక్కడ బస్‌స్టాప్ అవసరాన్ని వారు వివరించారు. వైశ్య సంఘం ప్రతినిధులు వరదా సూరిబాబు, నూలు కృష్ణ, అప్పన వీరన్న పాల్గొన్నారు.

విద్యార్థులు ఆసుపత్రి సందర్శన

యానాం: క్షేత్ర పర్యటనలో భాగంగా కాకినాడ జిల్లా పరిధిలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపికైన ప్రతిభావంతులైన విద్యార్థులు బుధవారం స్థానిక ప్రభుత్వ రంగంలో జిప్‌మెర్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా సుమారు 125 మంది విద్యార్థిని, విద్యార్థులతో పాటు మరో 20 మంది ఉపాధ్యాయుల బృందం జిప్‌మెర్ మల్టీ స్పెషాలిటీ యూనిట్‌ను వారు సందర్శించారు. వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానవైద్యాధికారి ఆనంద్‌రాజ్ జిప్‌మెర్ ప్రాధాన్యతను వివరించారు.

హాస్యాస్పదంగా మాజీ మంత్రి వ్యవహార శైలి

యానాం: మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు వ్యవహారశైలి చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ అన్నారు. పుదుచ్చేరిలో బుధవారం ఎమ్మెల్యే అశోక్ విలేకర్లతో మాట్లాడారు. నాలుగైదు రోజులుగా అసెంబ్లీలో తాను ప్రస్తావించిన అంశాలన్నీ ఆయన చెబితేనే సీఎం, ఎమ్మెల్యేలు స్పందిస్తున్నట్లు కృష్ణారావు ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సమావేశాల్లో అనేక సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చానన్నారు. విద్యాశాఖలో పనిచేస్తున్న వారితోపాటు ఆశవర్కర్ల జీతాలు, ప్రజా పనుల శాఖలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఎఫ్‌టీసీఎల్ఆర్ జీతాల కోసం ప్రభుత్వం వారికి తగిన న్యాయం చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించానని ఆయన చెప్పారు. రెండు రోజుల క్రితం పాండిచ్చేరిలో విలేకరుల సమావేశంలో అవన్నీ తాను చెప్పేనే జరిగినట్లు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం మాజీ మంత్రి చేస్తున్నారని ఎమ్మెల్యే అశోక్ ఆరోపించారు.

పీఎం యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: భారత ప్రభుత్వం, ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగాపై విస్తృత ప్రచారం చేసిన వారికి అందించే ప్రధానమంత్రి యోగా అవార్డుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అంబేద్కర్ కోనసీమ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ అవార్డులు నిష్కళంకమైన ట్రాక్ రికార్డ్, యోగా ప్రమోషన్, అభివృద్ధికి అత్యుత్తమ సహకారం అందించిన వ్యక్తులు, సంస్థలకు అందిస్తామని అన్నారు. కోనసీమ జిల్లాల్లో అర్హత ఉన్న వ్యక్తులు, సంస్థలు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా లేదా స్వయంగా దరఖాస్తులను మార్చి 31లోపు తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఆశావర్కర్ల జీతం పెంపు

యానాం: యానాం, పుదుచ్చేరి, మహే, కారైకల్ రీజియన్లలో పనిచేస్తున్న ఆశావర్కర్ల జీతాలను రూ.10వేల నుంచి రూ.18 వేలకు పెంచుతూ బుధవారం సీఎం రంగసామి ప్రకటన చేశారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల జీతాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నందున సీఎం రంగసామికి, ఈ అంశంపై కృషి చేసిన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు ఆశావర్కర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్వా సాగును నిలిపివేయాలి



సన్నవిల్లిలో ఆక్వా సాగును పూర్తిస్థాయిలో నిలిపివేయాలని నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: సన్నవిల్లి గ్రామంలో గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఆక్వా జోన్ రీ సర్వేలో భాగంగా సర్పంచ్ చిక్కం జంగమయ్య ఆధ్వర్యంలో మత్స్యశాఖ అధికారులు బుధవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు గ్రామంలో 90 ఎకరాల్లో 14 ఏళ్లగా ఆక్వా సాగు చేసి ఇటీవల కోర్టు ఆదేశాలతో నిలిపివేశామని, మరలా అధికారులు అనుమతిస్తే సాగు ప్రారంభిస్తామని సభలో పలువురు అభ్యర్థించారు. గ్రామంలో అక్రమంగా అధిక శాతం ఉప్పు నీటితో రొయ్యలు సాగు చేయడంతో దాదాపు రెండు వందల ఎకరాల్లో వరి, కొబ్బరి పంటలు దెబ్బతిన్నాయని స్థానికులు అన్నారు. గ్రామంలో తాగు నీరు, గాలి, నేల కలుషితమైందని పలువురు ఆరోపించారు. ఆక్వా చెరువులను పూర్తిస్థాయిలో నిలిపివేయాలని గ్రామస్తులు కోరారు. ఇరువర్గాల అర్జీలను అధికారులు స్వీకరించారు. గ్రామంలో గతంలో అనధికారికంగా ఆక్వా సాగు జరుగుతోందని ఎఫ్‌డీవో బి.హేమానంద్ విచారించి తేల్చారని, మరలా ఆక్వా జోన్‌గా ప్రకటించి ఆక్వా సాగుకు అనుమతులిస్తామని ఆయన చెబుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆక్వాతో గ్రామాన్ని కలుషితం చేయవద్దని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏవో జి.కుమార్ బాబు, వీఆర్వో పి.బాలాజీ పాల్గొన్నారు

పది లీటర్ల సారా స్వాధీనం

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారం 1800 లీటర్ల బెల్లపుఊటను కనుగొని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎక్సైజ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక సమీప గోదావరి లంకలో దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే మూల ద్రవం 1800 లీటర్ల బెల్లపుఊట నిల్వ ఉంచిన ప్లాస్టిక్ పీపాలను గుర్తించారు. వాటిని వెలికితీసి, వాటిలో ఊటను ధ్వంసం చేశారు. 5 కేజీలు అమ్మోనియా, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

వీరేశ్వరస్వామి ఆలయానికి రూ.15 లక్షల ఆదాయం



వీరేశ్వరస్వామి ఆలయంలో హుండీ నగదు కానులకు హారతి ఇస్తున్న అర్చకులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి 110 రోజులకు హుండీల ద్వారా రూ.15 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆలయంలోని హుండీలను బుధవారం ఆలయ తనిఖీ అధికారి రామలింగేశ్వరావు సమక్షంలో అధికారులు, గ్రామస్తుల పర్యవేక్షణలో సిబ్బంది, సేవాదళ్, గ్రామస్తులు లెక్కింపులో పాల్గొన్నారు. ప్రధాన హుండీల ద్వారా రూ.8,75,849, నిత్యకల్యాణం కట్న కానుకల ద్వారా రూ.6,04,933, అన్నదాన హుండీ ద్వారా రూ.93,061, మొత్తం రూ.15,73,843 సమకూరినట్లు ఈఓ తెలిపారు. తొలుత ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు హుండీ కానులకు హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు.

పది పరీక్షలకు 751 మంది హాజరు

ముమ్మిడివరం: మండలం పరిధిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ముమ్మిడివరం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, అయినాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఠానేల్లంక ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదు పరీక్షా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించారు. మండలంలో మొత్తం 753 మంది విద్యార్థులకు 751 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఏసీజీఈ బి. హనుమంతరావు ఠానేల్లంక బాలికల గురుకుల పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఉపాధి పనులపై శిక్షణ తరగతులు



ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఏపీడీ రాంబాబు

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయంలో భీమనపల్లి, గొల్లవిల్లి, సన్నవిల్లి, ఉప్పలగుప్తం గ్రామాలకు చెందిన 55 మంది మేట్లకు ఏపీడీ డి.రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎమ్ఎమ్ఎస్ ద్వారా మస్తర్లు ఎలా పంపాలి, కొలతలు ఎలా తీసుకోవాలి అనే అంశాలపై మేట్లకు శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజకుమార్, ఏపీవో వి.రాజామణి, ఈసీ ఎం.వీరబాబు, టీఏలు బాలరాజు, దేవి పాల్గొన్నారు.

గడువులోగా పన్ను చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలో ఇల్లు, ఖాళీ స్థలం పన్నులు ఈనెల 31వ తేదీలోగా పూర్తిగా చెల్లించే వారికి వడ్డీలో 50 శాతం రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. పన్ను చెల్లింపుదారులు సమీపంలోని మీసేవ కేంద్రాలు, సచివాలయం, నగర పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో పన్నులు చెల్లించి వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెలవు దినాల్లోనూ పన్నులు చెల్లించేందుకు కౌంటర్లు తెరిచి ఉంటాయన్నారు. ఇంటి వద్ద నుంచి ఈఆర్‌పీ, వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా పన్ను చెల్లించవచ్చని తెలిపారు.

మసీదుల్లో ఇఫ్తార్ విందు

యానాం: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని బుధవారం యానాం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్, నాయకుడు కాటంశెట్టి రామ్మూర్తి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఇచ్చారు. ఈ సందర్భంగా చారిత్రక జామియా మసీదు, వెంకటరత్నం నగర్‌లోని మసీదుల్లో ఇచ్చిన ఇఫ్తార్ విందుకు అధిక సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. అనంతరం అర్ధాని దినేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మైనారిటీల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందని, ముస్లింల హక్కుల కోసం పోరాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మెల్లం చిన్న, శ్రీమంతుల శ్రీధర్, జామియా మసీదు అధ్యక్షుడు ఎస్‌కేఎమ్ జిలానీ, వైస్‌ప్రెసిడెంట్ కరీమ్, ట్రెజరర్ జిలానీ, సెక్రటరీ సుభానీ, జాయింట్ సెక్రటరీ ఎండీ గౌస్‌ముహుద్దీన్, ముస్లిం పెద్దలు తాజుద్దీన్‌భాషా, ఫిరోజ్‌మహ్మద్, హమీద్ నవాజ్ పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వర్తించాలి

ఉప్పలగుప్తం: అంగన్‌వాడీ కార్యకర్తలు విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఐసీడీఎస్ సీడీపీవో వై.విజయశ్రీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ, పడాయి భీ పథకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో భాగంగా నవ చైతన్య ఆధారశిల అనే అంశాలపై, పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్స్ ఎం.రమాదేవి, కె.లీలాకుమారి, కార్యకర్తలకు శిక్షణనిచ్చారు.